క్లుప్తంగా

నీట్ ఫలితాల్లో మెరిసిన కదిరి విద్యార్థి


హితేశ్వర్‌రెడ్డి

కదిరి అర్బన్: నీట్ ఫలితాల్లో పట్టణానికి చెందిన సి హితేశ్వర్ రెడ్డి 650 మార్కులతో 9,412 ఆల్ ఇండియా ర్యాంక్ సాధించాడు. ప్రభుత్వ ఉపాధ్యాయులు నిత్యానందరెడ్డి, ఇందిర దంపతుల కుమారుడైన ఇతడు ఇంటర్‌లో 967 మార్కులు సాధించాడు. వైద్య వృత్తిలో చేరి ప్రజలకు సేవ అందించాలనేది తన కోరిక అని విద్యార్థి చెబుతున్నాడు.

వార్డు సచివాలయం మార్పు

కదిరి టౌన్: ఆర్‌అండ్‌బీ కార్యాలయం సమీపంలో ఉన్న రెవెన్యూ కాలనీ వార్డు సచివాలయాన్ని మున్సిపల్ కార్యాలయం ముందు ఉన్న మున్సిపల్ భవనంలోకి మార్చనట్లు మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ గురువారం తెలిపారు. రెవెన్యూ కాలనీ వార్డు సచివాలయంలో అన్నా క్యాంటీన్ పునఃప్రారంభిస్తున్న సందర్భంగా సచివాలయాన్ని మార్చామన్నారు. రెవెన్యూ కాలనీ వార్డు ప్రజలు మార్పును గమనించాలని కోరారు.

పాఠశాలలు పునఃప్రారంభం


తొలిరోజు పాఠశాలకు వెళ్తూ నాన్నమ్మ పాదాలకు నమస్కారం చేస్తున్న చిన్నారి

బత్తలపల్లి: వేసవి సెలవులు అనంతరం గురువారం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు తలుపులు తెరుచుకున్నాయి. ప్రైవేట్ పాఠశాలలకు మెరుగులు దిద్దగా, ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రం ఎలాంటి అలంకరణ కనిపించలేదు. మొదటి రోజు విద్యార్థుల హాజరు తక్కువగా ఉంది. ప్రైవేట్ పాఠశాలలు మధ్యాహ్నం వరకూ పనిచేశాయి.

పాఠశాలలకు పుస్తకాల పంపిణీ


పుస్తకాలను ఆటోల్లో తీసుకెళ్తున్న ఉపాధ్యాయులు

ముదిగుబ్బ: మండలంలోని పాఠశాలలకు గురువారం ప్రభుత్వం నుంచి సరఫరా అయిన పాఠ్యపుస్తకాలను ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. మొత్తం 72 పాఠశాలలకు గాను 18,772 నోట్ పుస్తకాలు, 21,786 పాఠ్య పుస్తకాలను పంపిణీ చేసినట్లు ఎంఈఓ రమణప్ప తెలిపారు.

ఏపీఎస్ఎఫ్ అధ్యక్షుడిగా కొత్తకోట హరీష్



రాఘవేంద్ర నుంచి నియామకపత్రం అందుకుంటున్న కొత్తకోట హరీష్

కదిరి అర్బన్: ఆంధ్ర ప్రదేశ్ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన కొత్తకోట హరీష్‌ను నియమిస్తున్నట్లు ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఆకుల రాఘవేంద్ర నియామక ఉత్తర్వులు జారీ చేశారు. విద్యారంగంలోని సమస్యలపై రాజీలేని పోరాటాలు చేయాలని అధ్యక్షుడు హరీష్‌కు సూచించారు. అలాగే ఏపీఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా శివను నియమించారు.

అదమమరిస్తే అంతే సంగతులు!


రోడ్డు మధ్యలో పెద్ద గుంతలు పడిన దృశ్యం

ధర్మవరం రూరల్: మండలంలోని పోతుకుంట పోలీస్ గెస్ట్ హౌస్ సమీపంలో నడిరోడ్డుపై పెద్ద గుంతలు పడ్డాయి. వాహనదారులు వేగంగా వెళ్తూ గుంతల వద్ద ఒక్కసారిగా బ్రేక్ స్టుండడంతో.. వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల ఈ ప్రాంతంలో పలువురు ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి కింద పడి గాయపడిన సంఘటనలు చాలా ఉన్నాయని స్థానికులు అంటున్నారు. అధికారులు స్పందించి గుంతలు పడిన రహదారిని బాగు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

విత్తనశుద్ధి... పంటల వృద్ధి

- అధిక దిగుబడులు వచ్చే అవకాశం
- మండల వ్యవసాయాధికారి లోకేశ్వరరెడ్డి

ఎన్పీకుంట: రైతుకు విత్తనశుద్ధి ఎంతో ఉపయోగకరం. ఏ పంట సాగుకు ముందైనా విత్తన శుద్ధి చాలా ముఖ్యం. నేలలో వేసే విత్తనం నాణ్యతతో కూడినదిగా ఉండటంతో పాటు వేసే ముందు తగిన జాగ్రత్తలు తీసుకుంటేనే దిగుబడులు కూడా బాగా ఉంటాయి. అయితే చాలా మంది రైతులకు ఈ విత్తన శుద్ధి ఎలా చేయాలో తెలియక తమకు తోచినట్లుగా శుద్ధి చేస్తూ నష్టపోతున్నారు. ఖరీఫ్ సీజన్ లో మంచి దిగుబడులు సాధించాలంటే విత్తనశుద్ధి చేయడంతో పాటు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనలు తప్పకుండా పాటించాలి. తద్వారా తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితాలను పొందవచ్చు. వ్యవసాయంలో ఉత్పాదక వ్యయం అధికంగా ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో పంట సాగులో మెలకువలు పాటించి, ఖర్చు తగ్గించు కోవాల్సిన అవసరం ఉంది. విత్తులు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో విత్తనశుద్ధి అవశ్యకత పై మండల వ్యవసాయాధికారి లోకేశ్వరరెడ్డి పలు సూచనలు చేశారు. వివరాలు ఆయన మాటల్లోనే..


పొలంలో విత్తన శుద్ధిపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు.

వివిధ ప్రాంతాల విత్తనాలతో నష్టం

రైతులు విత్తు కోసం వివిధ ప్రాంతాల నుంచి విత్తనాలను సేకరిస్తారు. ఈ విత్తనాల ద్వారా శిలీంద్రాలు, బ్యాక్టీరియా, పురుగులు పంట మొలకెత్తినప్పుడు ఆశించి నష్టం చేకూరుస్తాయి. అంతే కాకుండా విత్తనం ద్వారా వ్యాపించి తెగుళ్లలో మొలకశాతం తగ్గి శిలీంద్రాలతో కుళ్లిపోయే అవకాశం ఉంది. విత్తనశుద్ధితో ఆరోగ్యకరమైన నారు, పంట వస్తుంది. మందుల పిచికారీ అవసరం కొంత మేర తగ్గడంతో పాటు పర్యావరణ కాలుష్యం తగ్గుతుంది. పైరుపై రసాయనిక ఎరువులను పిచికారీ చేయడం కంటే విత్తన శుద్ధి పాటించడం చాలా తేలిక. తక్కువ ఖర్చుతోనే మంచి ఫలితం సాధించవచ్చు.

విత్తనశుద్ధిలో జాగ్రత్తలు

- సూచించిన మందులతోనే విత్తనశుద్ధి చేయాలి.
- మోతాదుకు మించి మందును వాడరాదు.
- విత్తనశుద్ధి చేసేటప్పుడు విత్తనం పైపొర ఊడకుండ జాగ్రత్త వహించాలి.


మండల వ్యవసాయాధికారి వి.లోకేశ్వరరెడ్డి

- వేరుశనగ, పప్పుధాన్యాల విత్తనాన్ని ముందుగా శుద్ధి చేసి తరువాత రైజోబియం కల్చర్ పట్టించాలి.
- విత్తనశుద్ధి చేసిన విత్తనాలను తినడానికి, పశువులకు ఉపయోగించకూడదు.

వేరుశనగ

కిలో విత్తనానికి గ్రాము మోంకోజెట్ లేక గ్రాము కార్బండిజం లేక 10 గ్రాముల ట్రైకోడెర్మావిరిడీతో శుద్ధిచేస్తే కాండం తెగుళ్లు, కుళ్లు తెగుళ్లను నివారించవచ్చు. వేరు పురుగు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో కిలో విత్తనానికి 6.5 మిల్లీ క్లోరోపైరిఫాస్ లేదా 2 మిల్లీ ఇమిడాక్లోప్రిడ్ కలిపి విత్తనశుద్ధి చేయాలి.

కంది:

కిలో విత్తనానికి 8 గ్రాముల ట్రైకోడెర్మా మందుతో విత్తనశుద్ధి చేసుకుంటే ఎండు తెగుళ్లను నివారించవచ్చు.

టమాట:

విత్తనానికి 3 గ్రాముల థైరామ్ లేదా కామెటలాక్సిటిల్ తో విత్తనశుద్ధి చేసుకున్న తర్వాత రెండు గంటలకు 8 గ్రాముల ట్రైకోడెర్మా మందుతో విత్తనశుద్ధి చేయాలి.

జగనన్న వెంటే ఉంటాం..


ఓడీచెరువు: వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసిన కార్యకర్తలు


వైఎస్సార్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

నల్లమాడ: గెలుపోటములతో సంబంధం లేకుండా తాము ఎప్పుడూ జగనన్న వెంటే ఉంటామని వైఎస్సార్‌సీపీ నాయకులు స్పష్టం చేశారు. ఎన్నికల కోడ్ ముగిసిన నేపథ్యంలో వైఎస్సార్ కూడలిలోని డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి మండల కన్వీనర్ కే.సూర్యనారాయణ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ అమర్ రహే, జగనన్న నాయకత్వం వర్ధిల్లాలి, దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రసాద్, నాయకులు దుద్దుకుంట వెంకటరెడ్డి, సాంబశివారెడ్డి, కుళ్లాయినాయక్, గోవింద రెడ్డి, బాబావలి, దేవశానాయక్, నాగార్జున రెడ్డి, చంద్రహాస రెడ్డి, వెంకటేష్ నాయక్, చంద్రశేఖర్, లక్ష్మానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఓడీచెరువులో..

ఓడీచెరువు: ఎన్నికల కోడ్ ముగియడంతో గురువారం మండల కేంద్రంలోని వైఎస్సార్ సర్కిల్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి ఉన్న ముసుగును స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు తొలగించారు. వైఎస్సార్ విగ్రహాన్ని శుభ్రం చేసి, క్షీరాభిషేకం చేశారు. జై జగన్ అంటూ నినాదాలు చేశారు. వైఎస్ జగన్ మంచి చేసి ఓడిపోయారన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు గౌరవంగా తలెత్తుకుని తిరగాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనారిటీ కార్యదర్శి షామీర్ భాషా, టౌన్ కన్వీనర్ కోళ్ల కృష్ణారెడ్డి, సర్పంచ్ గోవిందు, మల్లూరి బయపరెడ్డి, శింగనమల బాబు, రత్నాకర్, అంజి, హరినాథ రెడ్డి, ఆరిఫ్ ఖాన్, ప్రభాకర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బీసీజీ వ్యాక్సిన్‌తో ‘క్షయ’కు చెక్


చెన్నేకొత్తపల్లి మండలం మేడాపురంలో బీసీజీ టీకా వేస్తున్న ఏఎన్ఎం


కదిరిలో ఆర్టీసీ ఉద్యోగులకు బీసీజీ వ్యాక్సిన్ వేస్తున్న దృశ్యం

కనగానపల్లి: బీసీజీ వ్యాక్సిన్‌తో క్షయ వ్యాధికి చెక్ పెట్టొచ్చని పీహెచ్‌సీ డాక్టర్ చెన్నారెడ్డి తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ఆరోగ్య సిబ్బంది ప్రజలకు బీసీజీ వ్యాక్సిన్లు వేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య సిబ్బంది క్షయ వ్యాధికి గల కారణాలు, దాని నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మండల వ్యాప్తంగా ఇప్పటి వరకూ సుమారు 1450 మందికి బీసీజీ వ్యాక్సిన్లు వేసినట్లు వైద్యులు తెలిపారు. ముక్తాపురం గ్రామ సచివాలయం వద్ద సీహెచ్‌ఓ నాయక్, హెల్త్ అసిస్టెంట్ మోహన్, ఏఎన్ఎం లక్ష్మి ఆధ్వర్యంలో పలువురికి బీసీజీ వ్యాక్సిన్లు వేశారు.

కదిరి అర్బన్: స్థానిక ఆర్టీసీ డిపోలో గురువారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగులకు బీసీజీ వ్యాక్సినేషన్ నిర్వహించారు. రన్నింగ్ స్టాఫ్‌లో ధూమపానం అలవాటున్న వారు, షుగర్ వ్యాధిగ్రస్తులు దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడకుండా బీసీజీ వ్యాక్సిన్ వేస్తారని డీఎం మైనోద్దీన్ తెలిపారు. దాదాపు 100 మంది ఉద్యోగులకు వ్యాక్సిన్ వేసినట్లు అసిస్టెంట్ డీఎంలు హరిమోహన్, హరిత తెలిపారు. కార్యక్రమంలో ఉద్యోగులు ఎన్వీ రమణ, శంకరప్ప, రవీంద్ర, యాకుబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.


తాడిమర్రిలోని అంగన్‌వాడీ కేంద్రంలో వృద్ధుడికి టీకా వేస్తున్న దృశ్యం


కనగానపల్లి మండలం ముక్తాపురం సచివాలయం వద్ద టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

చెన్నేకొత్తపల్లి: ఎన్ఎస్‌గేట్ పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో వైద్య సిబ్బంది గురువారం క్షయ వ్యాధి నివారణ టీకాలను వేశారు. ఎన్ఎస్‌గేట్ డాక్టర్ రవి నాయక్, డాక్టర్ ఉదయ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని వైద్య సిబ్బంది నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆయా గ్రామాల్లోని ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్లు, పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తాడిమర్రి: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం వైద్య సిబ్బంది వృద్ధులకు క్షయవ్యాధి నివారణ టీకాలు పంపిణీ చేశారు. తాడిమర్రి, నార్శింపల్లి, ఎం.అగ్రహారం, ఆత్మకూరు, కునుకుంట్ల, చిల్లవారిపల్లి, పెద్దకోట్ల, దాడితోట, పిన్నదరి, చిన్నచిగుళ్లరేవు తదితర గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు క్షయవ్యాధి గ్రస్తులు, వారి కుటుంబ సభ్యులు, వృద్ధులు, షుగర్, బీపీ వ్యాధిగ్రస్తులకు బీసీజీ టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు ప్రజలతో మాట్లాడుతూ ఈ టీకాలు వేసుకోవడంతో క్షయవ్యాధి ఉన్నవారికి నయం అవుతుందన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు హర్షవర్ధన్‌రెడ్డి, రంగనాయకులు, ఏఎన్ఎంలు కోమలి, సుగుణ, కృష్ణమ్మ, లక్ష్మీకాంతమ్మ, నాగలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

శారదా శంకర మఠంలో పూజలు

హిందూపురం: స్థానిక కోట ఏరియాలోని శారదా శంకరమఠంలో శారదా మహిళా మండలి, శంకర మఠం నిర్వాహకుల ఆధ్వర్యంలో మఠం వార్షికోత్సవం నిర్వహించారు. తొలుత అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, లక్ష పుష్పార్చన, కుంకుమార్చన చేపట్టారు. అనంతరం అన్నదానం, తీర్థప్రసాదాలు అందజేశారు.


ముదిరెడ్డిపల్లిలో వ్రతం ఆచరిస్తున్న మహిళలు

వాసవీ మాతకు పూజలు

ముద్దిరెడ్డిపల్లిలో అయ్యప్ప స్వామి ఆలయంలో వాసవి జయంతిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో వాసవీమాత చిత్రపటం కొలువుదీర్చి అర్చనలు చేపట్టారు. వేదపండితుల ఆధ్వర్యంలో మహిళలు వాసవాంబ వ్రతం ఆచరించారు. అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

నవజాత శిశువుల శ్రవణ వైద్య శిబిరం

పావగడ: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో నవజాత శిశువుల ఉచిత శ్రవణ వైద్య శిబిరాన్ని స్వామి వివేకానంద సంఘటిత గ్రామీణ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ శిబిరంలో నవజాత శిశువులకు ఈఎన్‌టీ వైద్యులు శ్రవణ పరీక్షలు నిర్వహించారు. ప్రతి శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు శ్రవణ చికిత్స శిబిరాన్ని నిర్వహిస్తామని స్వామి జపానంద తెలిపారు.

16న మూర్ఛ వ్యాధి చికిత్స శిబిరం

హిందూపురం: స్థానిక ఆర్పీజీటీ రోడ్డులోని అల్ హిలాల్ స్కూల్‌లో ఈనెల 16వ తేదీ ఉదయం 10 గంటలకు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మూర్ఛ వ్యాధి చికిత్స శిబిరం (ఫిట్స్ క్యాంప్) నిర్వహించడం జరుగుతుందని జెవీవీ అధ్యక్షులుడే రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి ఈటి.రామ్మూర్తి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని మూర్ఛ రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


వద్దుపల్లి వద్ద పచ్చగా మారిన అటవీ ప్రాంతం

భూమికీ పచ్చాని రంగేసినట్టు !

ఆత్మకూరు: వర్షాలు సమృద్ధిగా కురుస్తుండటంతో మండలంలో ఎటు చూసినా భూమి పచ్చగా మారిపోయింది. ఆత్మకూరు మండలం వద్దుపల్లి సిటీ పార్కు వద్ద దాదాపు 300 హెక్టార్లకు పైగా అటవీ ప్రాంతం ఉంది. కురుస్తున్న వర్షాలతో అటవీ ప్రాంతం అంతా పచ్చగానే కనిపిస్తోంది. అటుగా వెళ్తున్న వారు రోడ్డు పక్కన వాహనాలు ఆపి మరీ ఫొటోలు దిగుతున్నారు. భూమి మొత్తం పచ్చగా మారడంతో పశువులకు ఆహారానికి ఇబ్బంది లేకుండా పోయిందని గొర్రెల కాపర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


గడ్డి సమృద్ధిగా ఉండటంతో గొర్రెలు మేపుతున్న కాపరులు

విద్యా ప్రదాత సేవా పురస్కారాల ప్రదానం

హిందూపురం టౌన్: పట్టణంలోని ఆర్టీసీ కాలనీలోని ముస్లిం నగారా కార్యాలయంలో గురువారం సామాజిక సేవకులకు విద్యా ప్రదాత సేవా పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించారు. అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు ఉమర్ ఫారూక్ ఆధ్వర్యంలో సత్యసాయి జిల్లా రచయితల సంఘం పట్టణ అధ్యక్షుడు కల్లూరు రాఘవేంద్ర రావు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. కోవిడ్ మహమ్మారి సమయంలో కోవిడ్ బాధితులను అన్ని విధాల ఆదుకోవడంతో పాటు విద్యార్థులను చైతన్యం చేస్తూ వారికి సహాయ సహకారాలు అందించిన సీఎంఆర్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ మల్లికార్జున, చాంద్ బాషాకు అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ తరఫున పురస్కారాలను అందజేశారు. అలాగే ముస్లిం మైనార్టీ విద్యా చైతన్య సదస్సులో ప్రతిభా పురస్కారాలు అందుకోని విద్యార్థులకు విద్యా ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ప్రతి ఒక్కరూ సేవ చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఉబేదుల్లా హుసేన్, లైఫ్ వరల్డ్ ఉదయ్ కుమార్, అబ్దుల్ సలామ్, మౌలానా రిజా ఉర్ రహమాన్, మౌలానా సాజిద్, ఆర్ఎంఎస్ షఫీ, షబ్బీర్. ముస్తఫా ఖాన్, అల్ అమీన్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు.


పురస్కారాలు అందజేస్తున్న దృశ్యం

బస్టాండ్ వేలం రూ.32.25 లక్షలు

లేపాక్షి: స్థానిక గ్రామ సచివాలయంలో గురువారం సర్పంచ్ ఆదినారాయణ అధ్యక్షతన బస్టాండ్, వారపు సంతకు వేలం పాట నిర్వహించారు.


వేలంలో పాల్గొన్న అధికారులు, వేలం పాటదారులు

ఈ వేలం పాటలో సుమారు 10 మంది వేలం పాటదారులు పాల్గొన్నారు. లేపాక్షి గ్రామానికి చెందిన సైపుల్లా బస్టాండ్‌ను రూ.32,25,000 దక్కించుకున్నారు. వారపు సంతను రూ.1.80 లక్షల వరకు వేలం పాటదారులు పాడారు. అయితే వారపు సంతను రూ.3 లక్షల వరకూ పాడాలని పంచాయతీ నిబంధనలు విధించడంతో వేలం పాటను మధ్యలోనే నిలిపేశారు. వారపు సంత వేలం పాటను వాయిదా వేశామని.. తిరిగి శనివారం మరోసారి వేలం నిర్వహిస్తామని ఈఓఆర్డీ శివన్న పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమేష్‌తో పాటు వేలం పాటదారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సబ్సిడీపై కంది విత్తనాలు

నల్లమాడ: మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో సబ్సిడీపై ఎల్ఆర్‌జీ–52 రకం కంది విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి సుమతి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. నాలుగు కిలోలు (ఒక బ్యాగు) కంది విత్తనం ధర రూ.559.20 కాగా.. 30 శాతం సబ్సిడీ పోనూ రూ.391.44 రైతులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పరామర్శ


నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కొత్తచెరువు: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారేపల్లి జగన్ మోహన్‌రెడ్డి పార్టీకి చేసిన సేవలు చిరస్మరణీయమని పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి తండ్రి దుద్దుకుంట వెంకట్రామిరెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని నారేపల్లి గ్రామంలో జగన్ మోహన్‌రెడ్డి దినకర్మ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని నాయకులతో కలిసి నారేపల్లి జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జగన్‌మోహన్‌రెడ్డి మృతి పార్టీకి తీరని లోటు అన్నారు. పార్టీ కన్వీనర్‌గా 10 సంవత్సరాలు కష్టపడి పని చేశారని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రకాష్, నాయకులు సంజీవరెడ్డి, రమణారెడ్డి, లాయర్ చంద్రశేఖర్‌రెడ్డి, తలమర్ల రెడెప్పరెడ్డి, పుట్టపర్తి ఎంపీపీ పెడబల్లి రమణారెడ్డి, ఆవుటాల రమణారెడ్డి, తలమర్ల శ్యాం సుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించాలి


మామిళ్లపల్లి పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ శ్రీదేవి

కనగానపల్లి: ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థులకు ప్రతిరోజూ పౌష్టికాహారం అందించాలని ఎంఈఓ శ్రీదేవి ఎండీఎం ఏజెన్సీ సభ్యులు, ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని మామిళ్లపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం ఆమె విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వంటగది, ఆహార పదార్థాలను పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు పరిశుభ్రతతో కూడిన పౌష్టికాహారం అందించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం స్నేహలత, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేన్సర్ నివారణపై అవగాహన


వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న డీడీ శివ శంకర్

ధర్మవరం రూరల్: కేన్సర్ నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి గురువారం స్థానిక ధర్మవరం ఏరియా ఆసుపత్రిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం వచ్చే నెల 10 వరకూ విడతల వారిగా మెడికల్ ఆఫీసర్లకు, సీహెచ్‌ఓలకు, ఏఎన్ఎంలకు క్యాన్సర్, ఎన్‌సీడీ–సీడీలపై నిర్వహించనున్నట్లు డిప్యూడీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సెల్వియా సాల్మన్ తెలిపారు. అవగాహన కార్యక్రమాన్ని డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శివశంకర్ తనిఖీ చేశారు. వారు మాట్లాడుతూ నోటికి, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వారానికి వచ్చు క్యాన్సర్‌లపై అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నివేదిత, సూపరింటెంట్ మాధవి లత, గైనకాలజిస్టు శైలజ, పెథాలజిస్టు వైష్ణవి, పీహెచ్‌సీ వైద్యులు, సూపర్ వైజర్ రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

15న క్యాంపస్ డ్రైవ్

హిందూపురం టౌన్: పట్టణంలోని సప్తగిరి ఎంబీఏ, ఎంసీఏ కళాశాలల ఆధ్వర్యంలో ఈనెల 15న క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నారాయణ రెడ్డి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్, బెంగళూరుకు చెందిన కంపెనీలు జాబ్ మేళాలో పాల్గొంటాయన్నారు. కంపెనీల్లో డిజిటల్ మార్కెటింగ్, హ్యూమన్ రిసోర్స్ అకడమిక్ ట్రెయినీ విభాగాల్లో రూ.3 నుంచి రూ.3.6 లక్షల ప్యాకేజీతో వేతనాలు ఉంటాయన్నారు. ఎంబీఏ, బీబీఏ విద్యార్హత కలిగిన విద్యార్థులు తమ బయోడేటాతో జాబ్ మేళాలో పాల్గొనాలని సూచించారు.